క్లుప్తంగా

నేడు కాకరాపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3కు మొదలయ్యే ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

చేరిన 'ఆడుదాం ఆంధ్రా' కిట్లు



తుని మండల పరిషత్‌కు చేరిన క్రీడా సామగ్రి

తుని రూరల్: గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి అవసరమైన కిట్లు తుని మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. సోమవారం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర కిట్లు అందినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. మండలంలో 27 సచివాలయాలకు సరఫరా చేసేందుకు అవసరమైన మేరకు అందాయన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా వీటిని పంపిణీ చేస్తారన్నారు. ఆడుదాం ఆంధ్రాలో పాల్గొనేందుకు 15 ఏళ్ల యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 13లోగా పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. సచివాలయ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి మూడు వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు.

ప్రతిభ మెరుగుకు క్రీడలు దోహదం

గండేపల్లి: యువతలో ప్రతిభను మెరుగుపరచుకునేందుకు క్రీడలు దోహదపడతాయని ఎస్సై వై గణేష్‌కుమార్ అన్నారు. మల్లేపల్లిలో సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొమ్మ శ్రీను, గ్రామ ప్రముఖులు బలిరెడ్డి గంగరాజు, భాస్కరరావు, వీరబాబు, దుర్గాప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా లేజర్ ట్రీట్‌మెంట్

గండేపల్లి: నీలాద్రిరావుపేటలో గోకవరం రోడ్డును ఆనుకుని ఉన్న రాజేశ్వరి, రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాలలో 28 మందికి ఉచితంగా లేజర్ ట్రీట్‌మెంట్ ద్వారా కంటి ఆపరేషన్లు చేసినట్టు ఆస్పత్రి మేనేజర్ ఏ ప్రకాష్ తెలిపారు. వీరవరం, యానాం, జగ్గంపేట తదితర గ్రామాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి, ఆపరేషన్ అనంతరం మందులు అందజేసినట్టు వివరించారు. ఆపరేషన్ కోసం రోగుల తరఫున వసుధ ఫౌండేషన్ నగదు సాయాన్ని అందజేసినట్టు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారిని ఆస్పత్రి వాహనంలో వారి గ్రామాలకు తరలించినట్టు తెలిపారు.

మల్లేపల్లిలో అన్న సమారాధన

గండేపల్లి: మల్లేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలో భారీ అన్న సమారాధన జరిగింది. కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల వారు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

బాధితులకు సాయం

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టు సమీపంలోని దిబ్బల్లో జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులకు సోమవారం సాయం అందజేశారు. సీపీఐ (ఎంఎల్) నేత వినోద్‌మిశ్రా, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో బాధితులకు దుస్తులు, బియ్యం, వంట సామగ్రి పంపిణీ చేశారు. గణేష్ మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణసాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, నాగులాపల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌దళ్ నగర సంకీర్తన

తొండంగి: కార్తిక సోమవారం సందర్భంగా రావికంపాడులో సోమవారం హనుమాన్‌దళ్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. ఇస్కాన్ ప్రభుజీ పిల్లాచార్యులు, హనుమాన్ దళ్ అధ్యక్షుడు గణేష్ కన్న తదితరుల బృందం పల్లకీలో కృష్ణుని ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు వారికి స్వాగతం పలికారు.

అయోధ్య రామయ్య పాదుకా యాత్ర

గోకవరం: అయోధ్యలో త్వరలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం గ్రామంలో అయోధ్య రామయ్య పాదుకాయాత్రను సోమవారం నిర్వహించారు. శ్రీరామ పాదుకలను సమితి ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజా తలపై ఉంచుకుని గ్రామంలో ఈ యాత్ర నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, సభ్యులు అప్పలస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పంపా తీరంలో భక్తజన సందోహం



పుష్కర కాల్వ పక్కన గిరిప్రదక్షిణ రోడ్డులో నడుస్తున్న భక్తులు



కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శన



గిరిప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

పంపా తీరం.. భక్తజన తరంగం



పల్లకీలో సత్యదేవుడు, అమ్మవారి విగ్రహాలు



గిరిప్రదక్షిణలో భక్తులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పర్వత



తొలిపావంచా వద్ద భక్తుల సందోహం



ఆకట్టుకుంటున్న సత్యరథం అలంకరణ

- సత్యదేవుని నామజపంతో గిరిప్రదక్షిణ
- భక్తులకు మంచినీరు, ఫలహారాల పంపిణీ

అన్నవరం: కార్తికపౌర్ణమి సందర్భంగా సోమవారం నిర్వహించిన సత్యదేవుని గిరిప్రదక్షిణ కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లతో కలిసి ప్రదక్షిణం చేశారు. సత్య, రత్నగిరులతో పాటు పంపా తీరం కూడా భక్తులతో సందడి నెలకొంది. తొలిపావంచా నుంచి పంపా తీరం వరకూ భక్తులు స్వామివారి నామ జపం చేస్తూ నడిచారు. అన్నవరం దేవస్థానం సిబ్బంది, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభిమానులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు మజ్జిగ, పాలు, పండ్లు, పులిహోర పంపిణీ చేశారు. అంచనాకు మించి భక్తులు రావడంతో గంటలోనే మంచినీరు, ఫలహారాలు, పండ్లు, పాలు అయిపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కార్యక్రమం అనంతరం పంపా నదిలో పుణ్యస్నానాలు చేశారు. కొందరు భక్తులు తమ చిన్నారులను భుజాలపై కూర్చోబెట్టి గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నిండు చంద్రుని సాక్షిగా..

ఘనంగా పంపా నదికి పంచ హారతి



పంపా నదికి పంచ హారతులు సమర్పిస్తున్న పండితులు

అన్నవరం: తన చల్లని కిరణాలతో వెలుగులు నింపిన పౌర్ణమి నిండు చంద్రుని సాక్షిగా.. ఉప్పొంగుతున్న పంపా నదికి.. కార్తిక పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఘనంగా నదీ హారతుల కార్యక్రమాన్ని పండితులు నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఊరేగింపుగా పంపా తీరానికి తీసుకువచ్చి, ప్రత్యేక సింహాసనంపై ప్రతిష్ఠించి పండితులు పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితర పూజల అనంతరం పండితులు స్వామి, అమ్మవార్లను పంపా నది వద్దకు తీసుకెళ్లి, నదికి నమస్కరించి పండితుల మంత్రోచ్ఛరణ మధ్య పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు తదితర సారె సామగ్రిని సమర్పించారు. అనంతరం ఐదుగురు అర్చకస్వాములు పంపా నది ఒడ్డున, నదికి అభిముఖంగా నిలబడి మంత్రోచ్ఛరణ మధ్య పంచహారతులు సమర్పించారు. తొలుత ఏక హారతి, అనంతరం నేత్ర హారతి, బిల్వ హారతి, సర్పహారతి, పంచ హారతి, కుండ హారతి, నక్షత్రహారతి సమర్పించారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవారికి వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. అనంతరం ప్రసాద పంపిణీ జరిగింది. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాటీ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, దత్తాత్రేయ శర్మ, సుధీర్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు.

ఘనంగా వన దుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి కార్తిక పౌర్ణమి సందర్భంగా పండితులు సోమవారం ప్రత్యంగిర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు వంశీ, ఫణిశర్మ, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచిభట్ల ప్రసాద్ తదితరులు నిర్వహించారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అలసత్వం వద్దు

- శానిటేషన్ నిర్వహణపై చైర్‌పర్సన్ ఆగ్రహం
- తుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



ఏలూరి సుధారాణి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తుని: ప్రజలకు ప్రధానమైన పరిశుభ్రత విషయంలో శానిటేషన్ అధికారులు తీరు సంతృప్తికరంగా లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. అజెండాలోని 66 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లు, కాలువల నిర్వహణ, చెత్తసేకరణ బాగోలేదన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జీరో అవర్ గరం గరం

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహించిన జీరో అవర్ గరంగరంగా సాగింది. ఇసుకలపేట డంపింగ్ యార్డు నుంచి వచ్చే వాసన, పొగతో మూడు వార్డులకు చెందిన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాముర్తి మహేష్ సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రైవేటు ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్ల నుంచి వ్యర్థాల సేకరణకు ప్రాధాన్యమివ్వడంతో, రోడ్లు, కాలువల్లో చెత్త పేరుకుని విమర్శలు వస్తున్నాయని పలువురు కౌన్సిలర్లు గళం వినిపించారు. దీనిపై సుధారాణి స్పందిస్తూ, ప్రజల విషయంలో అలసత్వం వద్దని, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్ల వారే చెత్తను డస్ట్‌బిన్స్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌కు సూచించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది చాలడంలేదని, అదనపు సిబ్బందికి అనుమతి ఇవ్వాలని శేఖర్ కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో సిబ్బంది నియామకం సాధ్యం కాదని, ఉన్నవారితోనే చేయాలని సుధారాణి ఆదేశించారు. సచివాలయాల్లో ఉన్న శానిటేషన్ కార్యదర్శుల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. కౌన్సిలర్లు విధిగా వార్డుల్లో పర్యటించి, సమస్యలపై సిబ్బందితో పని చేయించాలని సూచించారు. ఇసకలపేట వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు గేటు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కోలా శ్రీను కోరారు. ప్రజలకు మంచి సేవలు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. రాజుపేటలో రాజా, జగనన్న టౌన్ షిప్‌లో గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఏఈలు సుబ్రహ్మణ్యం, వేంకటేశ్వరరావును సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దంతులూరి రూపాదేవి, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి



విశేషాలంకరణలో రాచపల్లి అరుణాచలేశ్వర స్వామివారు



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామి వారికి అన్నాభిషేకం చేస్తున్న పండితులు



ఏలేశ్వరం శివాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



భారీఎత్తున తరలివచ్చిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విజయ గణపతి స్వామి వారికి అభిషేకం, అర్చన, గోపూజ, అనంతరం సామూహిక మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అరుణాచలేశ్వరస్వామి వారికి భారీఎత్తున అన్నాభిషేకాన్ని నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు పరిసర గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా భారీఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ వేడుకను రమణా సేవాశ్రమ వ్యవస్థాపకుడు రామానంద బ్రహ్మచారి పర్యవేక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో స్వామి వారికి అన్నాభిషేకం చేసిన అన్నాన్ని ప్రసాదంగా అందించారు. న్యూఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి అరుణాచల స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రమణా సేవాశ్రమం పీఠాధిపతి రామానందస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులతో శివాలయాలు కిటకిట

ఏలేశ్వరం: కార్తిక సోమవారం శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. నియోజకవర్గవ్యాప్తంగా శైవ క్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం సమీపంలోని సత్యనారాయణ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేంకటేశ్వర స్వామి వారి ఉపాలయాన్ని భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా సుదర్శన హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైభవోపేతంగా సుదర్శన హోమం నిర్వహించారు. సోమవారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన భగవానుడికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. తుని భద్రకాళి అమ్మవారి సన్నిధిలో కార్తిక పౌర్ణమి సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు.

భక్తుల శివనామ స్మరణ

గండేపల్లి: సదా శివోహం అంటూ భక్తులు శివాలయాల్లో శివనామ స్మరణ చేశారు. కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు శివాలయాల వద్ద దీపాలు వెలిగించి, శివార్చన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సర్వజనులను కాపాడాలని తాళ్లూరు శివాలయంలో అయ్యప్ప, శివ, సత్యదేవ దీక్షాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రదోషవేళ మహిళలు నంది, ధ్వజస్తంభం వద్ద కార్తికదీపాలు వెలిగించారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: కార్తికమాసం రెండవ సోమవారం గోకవరం మండలంలో పలు గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. రమాసత్యన్నారాయణ స్వామి ఆలయంలో ఉన్న ఉమా సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కొత్తపల్లిలోని బాలత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయానికి భారీఎత్తున భక్తులు పోటెత్తారు. మురళీనగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఉన్న సోమేశ్వరస్వామి, తంటికొండలో అఖిలాండేశ్వరీ సమేత జంబుకేశ్వరస్వామి ఆలయం, కృష్ణునిపాలెంలోని పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు అనేక శివాలయాలు కిక్కిరిశాయి.

పంచాయతన ఆలయంలో..

ప్రత్తిపాడు : ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయం భక్తులతో నిండిపోయింది. పంచాయతన ఆలయంలో ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏలూరు, పెదశంకర్లపూడి గ్రామాల్లో నగర సంకీర్తన నిర్వహించారు. గోమాతకు పూజలు చేసి, మేళతాళాలతో ఊరేగించారు.

ఆలయాల్లో కార్తిక శోభ

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కత్తిపూడి, శంఖవరం, వేళంగి శివాలయాల వద్ద భక్తులు పోటెత్తారు.

రామలింగేశ్వరాలయంలో...

తొండంగి: కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో తొండంగి రామలింగేశ్వరాలయంలో లక్ష బిల్వార్చన, రుద్రహోమం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. గోపాలపట్నంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సప్తనదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్తిక లక్ష దీపారాధన జరిగింది. పైడికొండ, పీఈ చిన్నాయపాలెం, అద్దరిపేట, పంపాదిపేట, శృంగవృక్షం, ఏ.కొత్తపల్లి శివాలయాలు, బెండపూడి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా సప్తాహ మహోత్సవం

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ద్వితీయ సప్తాహ మహోత్సవాలు నాలుగో రోజు ఘనంగా జరిగాయి. కాకి రాంబాబు, పద్మరాజా భవాని దంపతులు ప్రత్యేక పూజలు చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భక్తులతో పోటెత్తిన నందనవనం



పూజలు నిర్వహిస్తున్న గొర్లి అచ్చియ్యనాయుడు దంపతులు

రౌతులపూడి: శృంగవరం–మెరక చామవరం సమీపంలోని నందనవనంలో ఉన్న ఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. కార్తిక సోమవారం కావటంతో తుని మండలం లోవకొత్తూరులో ఉన్న తలుపులమ్మతల్లి అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు దంపతులు కుటుంబ సమేతంగా స్వామివార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సమీపంలో జరిగిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. రౌతులపూడిలో ఉమారామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పేదల ముఖ్యమంత్రి జగన్



జగ్గంపేటలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న బండారు రాజా

జగ్గంపేట: అన్ని విధాలా పేదలకు మేలుజరిగే పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ముఖ్యమంత్రిగా నిలిచిపోతారని జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా అన్నారు. జగ్గంపేటలో సోమవారం సచివాలయం–1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి, సమాజంలో పేదరికం పోవాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. పంచాయతీ ఈఓ గణేష్‌బాబు, సచివాలయ కన్వీనర్లు రెడ్డిభాను, చిట్టిమాని సత్యనారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

తుని: రోటరీక్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా రాజా కళాశాల మైదానంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. తుని, పరిసర ప్రాంతాలకు చెందిన జూనియర్, సీనియర్ కేటగిరీలో 30 జట్లు పాల్గొన్నాయి. క్లబ్ కార్యదర్శి కిశోర్‌రెడ్డి, తుని శాఖ అధ్యక్షుడు వర్మ, ప్రసాద్, నాగిరెడ్డి, గణేష్, మంగరాజు, సాయిబాబా పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత వినోద్ లెవెన్స్



విజేత జట్టుకు చెక్ ఇస్తున్న చదలవాడ బాబీ

కిర్లంపూడి: కాకినాడకు చెందిన సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో వినోద్ లెవెన్స్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో కొడితే కొట్టాలి పేరుతో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో ఉపాధ్యక్షుడు చదలవాడ బాబీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రైజ్ మనీ చెక్‌లను విజేతలకు అందజేశారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



క్విజ్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు

తుని: సౌత్ రీజియన్ భారత్ కో జానో క్విజ్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు సోమవారం తెలిపారు. భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నం కాపులుప్పాడ శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహించిన ఈ పోటీలో అజితేష్ త్రిపాఠి, కామిరెడ్డి గణేష్ పార్థు ద్వితీయ స్థానం సాధించారన్నారు. దేశ సాహిత్యం, సంస్కృతీ సంప్రదాయాలు, వర్తమాన వ్యవహారాలు అనే అంశాలపై దక్షిణ భారతదేశంలోని 8 విద్యార్థి బృందాలు పాల్గొనగా, శ్రీప్రకాష్ ద్వితీయ స్థానం సాధించిందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

గోకవరం: ఏపీఎస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభ పోస్టర్‌ను సోమవారం ఆర్టీసీ డిపో గేటు వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ ఐదున విజయవాడలో ఈ సభ జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.బేబీరావు, డిపో అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

రైతు కూలీల దీక్షలు

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో సీలింగ్ భూమిని సాగు చేసుకుంటున్న పేదలకే పంపిణీ చేయాలని కోరుతూ జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ రైతు కూలీ సంఘ సభ్యులు సోమవారం నిరాహార దీక్షలు చేపట్టారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ గుర్రంపాలెంలో సీలింగ్ భూమిని పేదలకు పంపిణీ చేయాలని ఏడాదిగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా స్పందించ లేదన్నారు.